# ధ్యేయం

సూర్యోదయం కాబోతూ ఉంది. సూర్య కిరణాలకి మంచుతెరలు కరుగుతూ ప్రకృతి ఆదోలాంటి అందంతో మెరుస్తూంది. తెల తెల్లని ఉదయ కాంతి చీకటిని తట్టి లేపుతూ ఉన్నట్లున్న ఆ దృశ్యాన్ని కిటికీలోంచి చూస్తూ ఉంది వసుంధర. లేవాలంటే బద్ధకంగా ఉంది. తల్లి లేచి పనుల్లో మునిగిపోయింది. ఆవిడ చేసే గిన్నెల చప్పుడు ఆదోలా వినిపిస్తూంది. చెల్లెలు శాంత లేచి పుస్తకాలు ముందేసుకుని చదువులో మునిగి ఉంది. తమ్ముడు బుచ్చిబాబు ముసుగు బిగించి పడుకున్నాడు.

"బుచ్చీ! లేచి చదువుకోరా." తల్లి పనులు చేసుకుంటూనే మధ్య మధ్య కేక పెడుతూ ఉంది. తల్లి పిలుపు వినిపిస్తున్నా బుచ్చిబాబు ముసుగు తీయటం లేదు.

"వీడు ఒట్టి బద్ధకస్థుడు. ఈ బద్ధకం ఊల్లోనే చదువులోనూ అంతంత మాత్రంగా ఉన్నాడు. శాంతా ఇంటర్‌లోకి వచ్చేసింది. 'చదువు కోనే" అని తను గానీ, తల్లిగానీ చెప్పక్కర్లేదు. ముందు చదువు విషయం చూసుకున్న తరవాతనే మిగతా పని." వసుంధర చెల్లెలి వైపు తృప్తిగా చూసి మెల్లగా లేచింది. ముఖం కడుక్కునే సరికి కాఫీ అందించింది తల్లి.

"వసూ ! నీ కివాళ కాలేజీకి సెలవేగామ్మా ... కాస్త వంట విషయం చూసుకో. పదింటికి షార్టుహాండ్ క్లాసుకి వెళ్ళుచూడూ, ఇవాళ మజ్జిగ లేవు. చారు పెట్టుకోండి. ఆ మూల బుట్టలో నాలుగు బెండకాయ లున్నాయి.

వేయించుకోండి. బుచ్చిబాబు ఇంకా లేవలేదు. కదూ!''

"లేవలేదమ్మా! వాడి సంగతి నే చూస్తా లేమ్మా— ఇవాళ పనెక్కడ మీకు?''

''లాయరు గారింట్లో పెళ్ళి చూపులట. నన్ను, నాంచారమ్మని పనికి రమ్మన్నారు. రెండు రకాల స్వీట్లు కారాలూ చేసి వంట చేయాలని చెప్పారు.''

''గాయత్రికా పెళ్ళిచూపులు? ఇంకా చదువు పూర్తి కాలేదుగా? నిండా పదహారు ఏళ్ళు లేవుగా?''

''లేకుంటేనేం? శ్రీమంతుల గారాల బిడ్డ. ఎవరో వాళ్ళంత వాళ్ళుగా 'మీ అమ్మాయిని చూస్తాం అని వస్తున్నారట."

''అంటే అర్థం గాయత్రికి అన్నదమ్ములూ, అక్క చెల్లెళ్ళూ లేరు గనుక లాయరు గారి రెండు లక్షల ఆస్తికీ ఆ అమ్మాయే అధికారిణి గనుక ఎవరైనా చేసుకుంటామని వస్తారమ్మా."

''అవును, ఈ ప్రపంచంలో డబ్బు లేని వాళ్ళు డబ్బుకి కొరగారు." తల్లి నిట్టూర్చింది.

"రాజమ్మా! రామ్మా, ఆలస్యం అయిపోయింది.? నాంచారమ్మ వచ్చి పిలిచింది.

రాజమ్మ లేచి వెళ్ళిపోయింది. వెళ్ళే తల్లినే చూస్తూ నిలుచుంది వసుంధర. తన చిన్నప్పుడు— అంటే తెలిసీ తెలియని వయస్సులో రోజూ తల్లి 'ఏదో పనిఉంది' అటూఇటయటికి వెళ్ళటం మాత్రమే తెలిసేది. ఆవిడ ఏం పని చేస్తుందో తెలియదు. ఈ సంసారంలో నలుగురు బ్రతకటానికి డబ్బు ఎలా వస్తుందో తెలియదు. కానీ, ఒకసారి స్కూల్లో తోటి పిల్లలు ఆటల్లో ఫస్ట్ వచ్చిందనే అసూయతో ఏదేదో అంటూ ఉంటే తను పౌరుషంగా వాళ్ళ మాటలని అన్యాయం అని ఖండించింది. వాళ్ళు చాలా తేలిగ్గా అనేశారు.

"మహా తెల్సులే నీకు న్యాయం వంటామె కూతురు కూడా న్యాయం చెప్పొచ్చేదే."

ఈ మాటలకి మరీ ఏడుపొచ్చేసింది వసుంధరకి.

"మా అమ్మ వంటామె కాదు.... కాదు" అని గొంతు చించుకుని అరిచింది. ఇది చూసిన ఆ పిల్లలకి సరదా వేసింది.

''నువ్వు క్లాసులో ఫస్ట్ మార్కు తెచ్చుకుంటున్నా, ఆటల్లో గెలిచినా. అందంగా ఉన్నా వంట దాని కూతురివే. కావాలంటే మాతోరా. మీ అమ్మ చేసే పని చూపిస్తాం'' అని లాక్కువెళ్ళి రాజమ్మ ఒక పెళ్ళిలో చేస్తున్న పని చూపించారు. వసుంధరకి దుఃఖం ముంచుకొచ్చింది. సాటి పిల్లల్లో తనకి ఏదో విలువ పోయిందని బాధపడిపోతూ ఇల్లు చేరింది. ఏడ్చింది. తనని వంటామె కూతురుగా పుట్టించిన దేవుడిని తిట్టింది. తోటి పిల్లలలో ఎవరికీ లేని ఈ దురదృష్టం తన కెందుకు కలగాలని కుమిలి కుమిలి ఏడ్చింది అన్నం తినకుండా లిలిగి పడుకుంది.

ఉదయమనగా బయటికి వెళ్ళి రెక్కలు ముక్కలు చేసుకుని, అందుకు ప్రతిఫలంగా వచ్చిన ఇరవై రూపాయలనీ తెచ్చి పెద్ద కూతురికి స్కూలు ఫీజు కట్టాలని మెంతుల డబ్బాలో దాచి, పిల్లలు ముగ్గురూ అన్నం తిన్నారో లేదో అని చూసుకుని, చిన్న కూతురు వేలుకున్నదని అడిగింది. అక్క అన్నం తినలే దామ్మా!''

''లేదమ్మా! స్కూలు నించి వచ్చిన దగ్గర నించీ అదోలా ఉంది, నేను సలకరించినా పలకలేదు అన్నం తినలేదు."

''ఏమైందో!' రనుకుంటూ చిరుచాప పరుచుకుని తలకింద ఒక చెయ్యి పెట్టుకుని పడుకుని అంతలోనే గాఢ నిద్రలోకి ఒరిగిపోయే తల్లిని అసహ్యంగా చూడసాగింది వసుంధర.

శాంత కూడా కాస్సేపు చదువుకుని, లైటు తీసేసి తల్లి పక్కనే వెళ్ళి పడుకుంది. వెంటనే నిద్ర పోయింది. ఈ ఇంట్లో నిద్ర పట్టనిది ఒక్క

తనకే. వసుంధర రాత్రి అంతా జాగారం చేసి తెల్లవారు జామునే నిద్ర పోయింది. ఆలస్యంగా లేచి ముఖం కడుక్కుంది.

"ఏమమ్మా! రాత్రి అన్నం తినలే దెందుకూ?' తల్లి కాఫీ గ్లాసు అందిస్తూ ప్రేమగా అడిగింది.

"నువ్వు చేస్తున్న పని కళ్ళారా చూశాను. కడుపు నిండింది" అని విసురుగా జవాబివ్వాలని అనుకుంది. కానీ, మాట పెదవులు దాటి బయటికి రాలేదు.

"ఏమ్మా చేతికి ఆ కట్టేమిటమ్మా! అయ్యో! అలా కాలిందేమమ్మా" శాంత తల్లి చేతిని తన చేతిలోకి తీసుకుని చూస్తూ బాధ పడసాగింది.

"కాగే కాగే నూనే పడిందమ్మా. పుండు అవుతుందేమో! అదే పోతుందిలే."

శాంత కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అమ్మా, నువ్వు వెళ్ళద్దమ్మా. నువ్వు చేసే ఆ పని నేను చేస్తా నమ్మా. నే నింక చదువుకోనమ్మా. మా కోసం నువ్వు ఇలా కష్టపడటం నేను చూడలేనమా."

"నువ్వు చదువు మానేస్తావా! నే చేసే ఈ పని నువ్వు చేస్తావా! వద్దమ్మా.... మీరు ఇలాంటి పని చెయ్యవద్దు. నేను చెయ్యనీయను. నువ్వూ, అక్క బాగా చదువుకోవాలి. ఏదైనా ఉద్యోగాలు చూసుకోవాలి. పెళ్ళి చేసుకుని హాయిగా భర్తలతో కాపరాలు చేయాలి. ఆడదానికి పెళ్ళి అయినా భర్త వున్నా, పరిస్థితులు ఎటొచ్చి ఎటు పోయినా, తన బ్రతుకు తను బ్రతకగల శక్తి కావాలమ్మా. అందుకు చదువు చాలా అవసరం, అమ్మా ఇందుకే మిమ్మల్ని ఇంత పట్టుదలగా చదివిస్తున్నాను. నా కా కాలంలో అక్షరం ముక్క నేర్చుకునే శ్రద్ధ లేక, శ్రద్ధ ఉన్నా అవకాశం లేక, అవకాశం ఉన్నా దాని అవసరం ఏమిటో తెలియక ఇలా శరీర కష్టం చేసి బ్రతకాల్సి వచ్చింది. ఈ కాలం వాళ్ళకీ అవస్థలు ఉండకూడదు."

ఆవేశంగా, దుఃఖంగా అంది రాజమ్మ.

"మేం ఎంత కష్టపడి చదువుకున్నా డిగ్రీలు వస్తాయి కానీ, ఉద్యోగాలు రావు, వసుంధర ముఖం మాడ్చుకుని అంది." రాజమ్మ ఇప్పుడు చూసింది కూతురు ముఖంలోకి.

'ఇది ఈ రోజు కొత్తగా మాట్లాడుతోంది ఏమిటి?' అనుకుంది.

"డిగ్రీలు తీసుకున్న తరవాత విషయం కదమ్మా అదీ. నువ్వు మనస్సు పాడు చేసుకోక చదువుకో." తల్లి నిదానంగానే అంది. కటువుగా

"ఉద్యోగం వచ్చినా పెళ్ళి మాత్రం చస్తే కాదు." అంది వసుంధర.

"ఏం! ఎందుకు కాదు? కాదని ఎవరన్నారు!"

"........"

"మీకేం తక్కువని పెళ్ళి కాదు?" రెట్టించింది రాజమ్మ.

"నీ ఉద్యోగం తెలిస్తే ...." అనబోయి శాంత తీక్షణంగా చూసే సరికి "ఆగిపోయింది. రాజమ్మ ఇంటి పనులు కొన్ని చేసి వెళ్ళిపోయింది.

"ఎందుకే, అక్కా, అదోలా ఉన్నావు? ఏమైంది? శాంత వసుంధర దగ్గరగా వచ్చి అడిగింది.

"అమ్మ ఏ పని చేసి డబ్బు సంపాదిస్తుందో నీకు తెలుసునా?"

"తెలుసు!"

"నా కిదంతా నచ్చటం లేదు."

"నచ్చదు—బాగానే ఉంది. కానీ, పని మానేస్తే మనకి తిండెలా! బట్టలెలా! చదువెలా!"

'నిజం ఎలా' ఆలోచనలో పడింది వసుంధర. ఎంత ఆలోచించినా ఏం ప్రయోజనం, బుర్ర పాడు చేసుకోవడం తప్ప. రోజులు గడచి పోతున్నాయి. వసుంధరకి శాంతి లేదు. అలాగే చదువుతూంది. ఒక్కో క్లాసూ పాసు అవుతూంది. ఇంటర్‌లోకి వచ్చింది. కాలేజీకి వస్తూ పోతూ వుండే దారిలో ఒక కుర్రాడు. ఇకిలిస్తూ సకిలిస్తూ నిల్చొని ఒకరోజు పలకరించాడు.

"సినీమాకి పోదాం వస్తావా!"

"ఏం? నీకు తోడు ఎవరూ లేదా" అంది.

"అమ్మాయి లెవరూ లేరు."

'అలాగా! అయితే, నన్ను పెళ్ళి చేసుకో ఎప్పుడూ తోడుగా ఉంటాను" అంది.

"సినీమాకి సరదాగా వచ్చే అమ్మాయిలని పెళ్ళాడటం మొదలెడితే ఎందరో పెళ్ళాలవుతారు. వాళ్ళందరూ నాకెందుకూ?"

"నెత్తి కెక్కించుకుని వూరేగేందుకు."

"ఏయ్! సరిగా మాట్లాడు. వస్తావా! రావా!"

"రమ్మంటవా!" అంటూ చాచి చెంపలు వాయించేసింది.

"మళ్ళీ పలకరించావో పళ్ళు రాలి పోగలవు జాగ్రత్త."

వంటదాని కూతురువి—నీ కింత పొగరా! నీ అంతు చూస్తాను. పళ్ళు కొరుకుతూ వెళ్ళాడు వాడు.

వసుంధరకి ఈ మాట మానుతున్న గాయాన్ని కెలుకుతున్నట్లుగా చేసింది.

'వంట దాని కూతురు ఛీ ఛీ'.... అనుకుంటూ ఇంటికి వెళ్ళలేక దాపులో ఉన్న దేవాలయంలోకి వెళ్ళి పుస్తకాలు పక్కన పెట్టుకుని,

మోకాళ్ళ మీద తల వంచుకుని కుమిలిపోసాగింది.

పూజారి దేవాలయంలోకి వస్తూ దగ్గరగా వచ్చి పలకరించాడు.

"వసుంధరా! పరీక్షలు జరుగుతున్నాయామ్మా?"

వసుంధరకి దుఃఖం ఆగలేదు. అది కట్టలు తెచుకుంది.

"ఏమైందమ్మా?" దగ్గరగా వచ్చి ప్రేమగా తల నిమురుతూ అడిగాడు.

వసుంధర తన మనస్సులోని బాధని చెప్పేసింది. ఆయన అంతా శాంతంగా విన్నాడు. ఆ తరువాత చిన్నగా నవ్వాడు. దగ్గర కూర్చున్నాడు

"పిచ్చితల్లీ! ఇంత చిన్న విషయానికా ఇంత బాధ పడుతున్నావు?"

"బాధ కాదండీ—మా అమ్మ వంట మనిషంటే సిగ్గు పడుతున్నాను"

"సిగ్గు పడుతున్నావా! తప్పు. గర్వపడాలి. అవునమ్మా. నువ్వు గర్వపడాలి."

"తాతగారూ?"

"అవునమ్మా. మీ అమ్మ కూడా శ్రీమంతుల ఇంటి ఆడపడుచే. అయినా, తను కావాలనుకున్న సంగీతం మాస్టారైన మీ నాన్నని పెళ్ళాడింది. ఇది తలిదండ్రులకి నచ్చక బయటకి పంపేశారు. అయినా, ఆవిడ భయపడలేదు. మీ నాన్న తెచ్చే చాలీచాలనీ డబ్బుతో కాలం దొర్లించేది. సంతోషంగా బ్రతికేది. నువ్వూ, శాంతా, బుచ్చిబాబూ పుట్టిన తరువాత ఆయన హార్ట్ ఎటాక్‌తో పోయాడు. నిలవ డబ్బు లేదు ఉన్న ఆధారాన్ని దేవుడు లాక్కున్నాడు. తన కన్నవారి దగ్గరికి వెడితే ఎంత నిరాదరణ లభిస్తుందో మీ అమ్మకి తెలుసు. అలాంటప్పుడు మీ అమ్మ మీ ముగ్గురినీ ఎలా బ్రతికించ గలుగుతుంది? ఆమె తన సుఖం, శాంతీ కూడా చూసుకోకుండా మీ ముగ్గురి కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటూంది.

చెమట ఓడ్చి డబ్బు సంపాదించి మిమ్మల్ని చదివిస్తూంది. ఇలాంటి కష్టజీవి మీ తల్లి అయినందుకు నువ్వు సిగ్గుపడ కూడదు. గర్వపడాలి. వసుంధరా మనిషి సిగ్గు పడవలసిన విషయాలు ఏమంటే—'దొంగతనం', 'వ్యసనం'! 'మోసం'—ఇవి చేస్తున్న వాళ్ళమ్మా సిగ్గు పడవలసింది."

"తాతగారూ!"

"వసుంధరా! భవిష్యత్తు విషయం భగవంతుడే చూస్తాడు. నువ్వు శాంతంగా చదువు పూర్తి చేసుకుని, ఏదైనా ఉద్యోగం చూసుకుని మీ అమ్మకి ఆ కష్టాన్నుంచి విముక్తి కలిగించు.

ఇదమ్మా నీ బాధ్యత. మీరు చదివే చదువులో. ఎక్కడ లోపం ఉందో నాకు తెలియదు కానీ, సమగ్రంగా ఒక్క విషయాన్నీ పరిశీలించ లేరు. పరిష్కరించలేరు. రామ్మా లోపలికి. వచ్చి భగవంతుడిని దర్శించు కుని వెళ్ళు. నీకు గుడికి రావటం మంచి అలవాటు ఉంది గదా!

"ఏదైనా అశాంతిగా ఉంటే నాకు చెప్పమ్మా. తెలిసినంతవరకు సలహా ఇస్తాను."

"అలాగే, తాతగారూ! అలాగే." వసుంధర దేవుడి దర్శనం చేసుకుని ఇల్లు చేరింది.

"ఆకలిగా ఉందమ్మా. ఏమన్నా పెట్టు." బుచ్చిబాబు మారాం చేస్తున్నాడు.

"ఇంట్లో ఏం లేవు, నాయనా. ఈ పది పైసలూ పట్టు కెళ్ళి మరమరాలు కొనుక్కో." తల్లి మాట వినకుండా కాళ్ళు బాదుకోసాగాడు.

"నువ్వు వాళ్ళింట్లో, వీళ్ళింట్లో ఎన్నోరకాల పిండి వంటలు. చేస్తావు గానీ, మాకు కాసిని కూడా పట్టుకురావు.

"ఖర్మకాలి చేస్తున్నాను."

"నాంచారమ్మ వాళ్ళ పిల్లలకి చాటుగుండా తెస్తుందట. వాళ్ళ బుద్ధిగాడు చెప్పాడు."

"నా కలాంటి పనులు నచ్చవు. నేను చెయ్యను."

"నాకు ఆకలిగా ఉంది."

"అయినా, చెయ్యను, మనకి డబ్బు లేకుంటే పస్తులున్నా ఫరవా లేదు కానీ, ఎవరి ఎదుటా తల వంచుకోవలసిన పని నేను చెయ్యను. మీకు అగౌరవం కలిగించను మీ అదృష్టం బాగుంటే—నా శ్రమ ఫలిస్తే-అక్క చదువు అయి ఉద్యోగం దొరికితే...."

"వూం.... దొరికితే...." బుచ్చిబాబు రెట్టించాడు.

"మన కష్టాలు గట్టెక్కుతాయి. అప్పుడు చేతనైన పిండి వంటలన్నీ ఈ నా చేతులతోనే చేసి మీ ముగ్గురికీ సంతోషంగా తినిపిస్తాను." రాజమ్మ కళ్ళలోని ఆశ చూసి బుచ్చి అన్నాడు.

"అక్కకి పెళ్ళి చేయవామ్మా!"

అవును కదూ! పెళ్ళి చెయ్యాలి. చేస్తాను—భగవంతుడు చల్లగా చూస్తే ..."

దేవాలయం నుంచి వసుంధర లోపలికి వస్తూ ఈ మాటలన్నీ వింది. విని తల్లి దగ్గరగా వచ్చింది.

"అమ్మా! దేవుడు చల్లగా చూస్తే నాకు ఉద్యోగం వస్తే ముందు నే చేసుకోవలసింది పెళ్ళి కాదు అని తెలుసుకున్నానమ్మా నా బాధ్యత శాంత చదువు పూర్తి చేయటం, నిన్నా వంట పని నుంచి మాన్పించటం, బుచ్చిని కాలేజీలో చేర్చటం .."

"ఇవన్నీ పూర్తి కావాలంటే నీ వయస్సు దాటిపోతుంది. ఇంక పెళ్ళెప్పుడు చేసుకుంటావమ్మా.

"మంరేం ఫరవాలేదు. పెళ్ళికి నాకు నాకు తొందర లేదు. నా ధ్యేయం పూర్తిగా నెరవేరాలి. అంతే." పట్టుదలగా అంటూన్న కూతురి ముఖంలోకి ఆశ్చర్యంగా చూడసాగింది రాజమ్మ.

'దీనిలో ఇలాంటి మార్పు ఎలా వచ్చింది? నా కూతురు అని చెప్పుకోవటానికే అభిమాన పడి డాక్టర్ కూతుర్ని, లాయర్ కూతుర్ని అని ఎందరితోనో అబద్ధాలు పలుకుతూ ఆత్మవంచన చేసుకున్న వసుంధరలో ఇంత మంచి మార్పు ఎలా వచ్చింది! ఇంత ఆరోగ్యకరమైన ఆలోచన ఎలా వచ్చింది! అర్థం కానట్లు చూడసాగింది రాజమ్మ. వసుంధరలో ఏదో కొత్త ఉత్సాహం, కొత్త శక్తి వచ్చినట్లుంది. ఈ శక్తిలో తను నిర్ణయించుకున్న మార్గాన సాగిపోవాలని స్థిర నిర్ణయం చేసుకున్నది.

(11-3-81 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)